క్లుప్తంగా

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

గంట్యాడ: వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేస్తే ఏ ఉద్యోగికి అయినా గుర్తింపు లభిస్తుందని ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహించిన వసంత రమణకు గుర్ల పోలీస్ స్టేషన్‌కు బదిలీ కావడంతో స్టేషన్ సిబ్బంది బుధవారం ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకుని కొనియాడారు.

సొండి కులస్తులను ఓబీసీలో చేర్చాలని వినతి



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సొండి కుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

చీపురుపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సొండి, సుండి కులస్తులను ఓబీసీ కేటగిరిలో చేర్పించేలా పార్లమెంట్‌లో చర్చించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను సొండి కుల సంక్షేమ సంఘం కోరింది. ఈ మేరకు సొండి కుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కాశీవిశ్వనాథ్ చౌదరితో పాటు సంఘ సభ్యులు చీపురుపల్లిలోని ఎంపీ నివాసంలో బుధవారం ఆయన్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్న సొండి కులస్తులను కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చేలా చూడాలని కోరారు. దీనిపై ఎంపీ సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సొండి కుల సంక్షేమ సంఘం కోశాధికారి ఆర్.శ్రీనివాసరావు, నల్ల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ప్రొసీడింగ్ పత్రాలు అందజేత

గంట్యాడ: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్ అన్నారు. మండలంలోని రామవరం గ్రామంలో గృహ లబ్ధిదారులకు బుధవారం ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేస్తోందన్నారు. అలాగే వివిధ దశల ప్రకారం ఇళ్ల నిర్మాణ బిల్లులను ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ కె.రాజ్‌గోపాల్ ఉన్నారు.

ప్రతిరోజూ బడికి రావాలి

గుర్ల: ప్రతి ఒక్కరూ చదువుకోవాలని జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుబ్రహ్మణ్యం అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌ను బుధవారం ఆయన సందర్శించారు. తరగతులకు హాజరుకాని విద్యార్థులను గుర్తించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధనతో పాటు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకోవాలని సూచించారు. పిల్లలను బడికి కాకుండా పనులకు పంపించే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారులు శ్రీనివాసులు, రమాదేవి, చంద్రశేఖర్, ఎంఈఓ భానుప్రకాష్ తదితరులు ఉన్నారు.

జగనన్న సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించాలి

గజపతినగరం: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో జారీ చేసే సర్టిఫికెట్లను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వనుందని, ఈ విషయాన్ని ప్రజల దృష్టిలోకి తీసుకు వెళ్లాలని ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమం అమలుపై బుధవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.అరుణ కుమారి, ఎంపీడీఓ కిశోర్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెల్లాన త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

దత్తిరాజేరు: అనారోగ్యంతో విజయనగరం మహారాజా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందినట్టు ఎస్.బూర్జవలస ఎస్ఐ జి.రాజేష్ తెలిపారు. దత్తిరాజేరు మండలంలోని మరడాం, తాడేందొరవలస పరిసర గ్రామాలలో తిరుగుతున్న వ్యక్తి అనారోగ్యానికి గురికావడంతో 17వ తేదీన సిబ్బంది సహాయంతో వైద్యంకోసం ఆస్పత్రిలో చేర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. 5 అడుగు ఎత్తు, చామనఛాయ, తెల్లటి గెడ్డం, లుంగీ ధరించిన ఉన్న వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఎస్. బూర్జవలస పోలీసులను (సెల్: 91211 09461) సంప్రదించాలని కోరారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రావాడ ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు ఈ నెల 28 వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. బీసీ, ఓసీలకు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉందన్నారు.

గజపతినగరం రూరల్: మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాలలో 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26న ప్రవేశ పరీక్ష నిర్వహించి, అందులో వచ్చిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని పేర్కొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎస్.కోట, గజపతినగరం, చీపురుపల్లి నియోజకవర్గాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ పలు విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, క్రమం తప్పకుండా యోగాసనాలు సాధన చేయడం వల్ల శరీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడి దూరం అవుతుందని వక్తలు వివరించారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: విద్యార్థులతో ప్రాణాయామం చేయిస్తున్న బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రం ఇన్‌చార్జి బీకే శాంతి



కొత్తవలస: కోర్టు ఆవరణలో యోగా సాధన చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి విజయ్‌చంద్ర



శృంగవరపుకోట: కోర్టులో న్యాయవాదులతో కలిసి యోగాసనాలు వేస్తున్న న్యాయమూర్తి ఎస్.వాణి



మెరకముడిదాం: భీమవరంలో ఉపాధి వేతనదారులతో యోగాసనాలు వేయిస్తున్న ఏపీఓ అప్పలనాయుడు



గజపతినగరం: యోగా దినోత్సవంలో పాల్గొన్న జూనియర్ సివిల్‌జడ్జి కనకలక్ష్మి



గంట్యాడ: పెదవేమలిలో యోగా చేస్తున్న పొదుపు సంఘాల మహిళలు



చీపురుపల్లి రూరల్: గరివిడి కేజీబీవీలో యోగా ఆంగ్ల అక్షర రూపంలో విద్యార్థుల విన్యాసం



వేపాడ: వేపాడలోని అప్పన్న చెరువు వద్ద వేతనదారులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్, ఏపీఓ ఆదిలక్ష్మి



జామి: విజినిగిరి శ్రీరామస్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఇది పేదల ప్రభుత్వం



గుర్ల: సంక్షేమ పథకాలను వివరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు

గుర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షపాతి అని జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండగండ్రేడులో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉన్నప్పటికీ ఏదైనా కారణంచే సంక్షేమ పథకాలు అందకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సారిక గోవింద్, ఎంపీటీసీ మణ్యపురి రామారావు, కెంగువ మధుసూదనరావు, తోట తిరుపతిరావు, సురేష్, జోగినాయుడు, ఎంపీడీఓ కల్యాణి, ఈఓపీఆర్డీ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

చీపురుపల్లి రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని, ఆయన పాలన చరిత్రలో సువర్ణాధ్యాయంగా మిగిలిపోతుందని ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జడ్పీటీసీ వలిరెడ్డి శిరీష అన్నారు. మండలంలోని కర్లాం గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికికే దక్కుతుందన్నారు. ప్రస్తుతం ఇస్తున్న పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణాన భాగ్యలక్ష్మి, స్థానిక నాయకులు బాణాన శ్రీనివాసరావు, బాణాన రమణ, మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసుల నాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఎంపీడీఓ కె.రామకృష్ణ రాజు, ఈఓపీఆర్డీ అన్నపూర్ణాదేవి పాల్గొన్నారు.



చీపురుపల్లి రూరల్: లబ్ధిదారులకు సీఎం సందేశ పత్రాన్ని అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

- ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ: విద్యతోనే పేదరికి నిర్మూలన సాధ్యమవుతుందని భావించి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు అన్నారు. సోంపురం జెడ్పీహెచ్ఎస్‌ను బుధవారం ఆయన సందర్శించారు. అక్కడ జరుగుతున్న నాడు–నేడు పనులు పరిశీలించారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. విద్యాకానుక కిట్లు అందాయా, ఎలా ఉన్నాయి? మధ్యాహ్న భోజనం బాగుంటుందా? అని అడిగి తెలుసుకున్నారు. వారితో పాఠ్యాంశాలను చదివించారు. నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. పిల్లలకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట సర్పంచ్ మురిపిండి గంగరాజు, ఎంపీటీసీలు ఆకుల సత్యనారాయణ, టి.వి.రమణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

24 గంటలు వైద్య సేవలందించాలి

బొండపల్లి: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగులకు 24 గంటల పాటు వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎస్.భాస్కరరావు సూచించారు. బొండపల్లి పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు చొప్పున పూర్తిస్థాయి వైద్యులను నియమించడం జరిగిందన్నారు. ఒకరు ఫ్యామిలీ డాక్టర్ వైద్యసేవలు అందించేందుకు గ్రామాలకు వెళితే, మరొకరు పీహెచ్‌సీలో ఉండి రోగులకు వైద్య సేవలందించాలని సూచించారు. మందులు, వైద్య పరికరాల కోసం తక్షణమే జిల్లా కేంద్రానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ, సీహెచ్ఓ రాజ్‌గోపాల్, సిబ్బంది ఉన్నారు.

ప్రకృతి సాగుతో బహుళ ప్రయోజనాలు

బొండపల్లి: ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందడంతో పాటు, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం ఎం.ఆనంద్ అన్నారు. మండలంలోని మరువాడ, బి.రాజేరు, జి.పి.అగ్రహారం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేస్తున్న పంటలను బుధవారం పరిశీలించారు. సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు సాగు చేయడం ద్వారా పెట్టుబడులు తగ్గడంతో పాటు మేలైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. ఈ విధానంలో సాగు చేస్తున్న పంటలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ రమేష్, ఎంటీ తులసీ, ఐసీఆర్‌పీలు ఎం.రామకృష్ణ, అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

సభ్యుల సహకారంతోనే అభివృద్ధి

కొత్తవలస: వార్డు సభ్యుల సహకారంతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రారామస్వామి అన్నారు. స్థానిక పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ ఆధ్యక్షతన బుధవారం సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులలో ఉన్న సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం సర్పంచ్ ఎర్రారామస్వామి మాట్లాడుతూ అందరి సహకారంతోనే పంచాయతీని అభివృద్ధి బాటలో నడపగలమన్నారు. సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

విత్తనాల పంపిణీ

వేపాడ: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు అన్నారు. నీలకంఠరాజపురం ఆర్‌బీకే వద్ద బుధవారం ఏఎంసీ చైర్మన్ మూకల కస్తూరీ, సర్పంచ్ గొటివాడ దేవీ, మండల కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, ఉపసర్పంచ్ పెదనాయుడుతో కలిసి రైతులకు రాయితీపై వరి విత్తనాలను పంపిణీ చేశారు. అదేవిధంగా సోంపురంలో ఆర్‌బీకే వద్ద సర్పంచ్ మురిపిండి గంగరాజు, సోంపురం, అరిగిపాలెం ఎంపీటీసీలు ఆకుల సత్యనారాయణ, టి.వి.రమణ తదితరులు విత్తనాలు పంపిణీ చేశారు.

ఆర్థిక అక్షరాస్యతపై చైతన్యం

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనల మేరకు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఎస్.కోట, చీపురుపల్లి, జగపతినగరం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో బుధవారం మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు వరుసగా రూ.5వేలు, రూ.4వేలు, రూ.3వేలు నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు అందజేశారు. ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులు ఈ నెల 28న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆర్‌బీఐ డిప్యూటీ మేనేజర్ దక్షిణ మూర్తి తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఆర్‌బీఐ డిప్యూటీ మేనేజర్ దక్షిణమూర్తి, హెచ్‌ఎం



శృంగవరపుకోట: విజేతలకు సర్టిఫికెట్లు ఇస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ హరికృష్ణ, ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు



గుర్ల: విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ భానుప్రకాష్, ఆర్‌బీఐ ప్రతినిధులు



వేపాడ: క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులతో పాటు అధికారులు, బ్యాంకు ప్రతినిధులు



లక్కవరపుకోట: మండల స్థాయి క్విజ్ పోటీలో విజయం సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ, తదితరులు

పాఠశాల పరిశీలన

గజపతినగరం: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న రెండో విడత నాడు–నేడు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఈఓ బలివాడ సాయిచక్రధర్ ఆదేశించారు. పురిటిపెంట రెగ్యులర్ స్కూల్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జగన్న విద్యాకానుక కిట్లు అందరికీ అందాయా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉపాధ్యాయుల బోధన తీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు.

ఆలయ వార్షికోత్సవం

వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

'జగనన్న సురక్ష'తో ఇంటి ముంగిటకే సేవలు

చీపురుపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుచేయనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం ద్వారా ప్రజల ఇంటి ముంగిటకే సేవలు అందుబాటులోకి వస్తాయని ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతీ గ్రామంలోనూ నిర్వహించనున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే ఈ నెల 23 నుంచి జూలై 1 వరకు వలంటీర్లు, గృహసారథులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం నిర్దేశించిన 11 అంశాల్లో ప్రజల అవసరాలను గుర్తించాల్సి ఉంటుందన్నారు. జూలై 1 నుంచి అధికార బృందాలు గ్రామాలకు వెళ్లి ఆయా సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు.

భూముల రీసర్వేపై ఆర్డీఓ సమీక్ష

శృంగవరపుకోట: మండలంలోని ముకుందాపురం గ్రామంలో సర్వే నంబరు 4/1లో ఉన్న 1.68 ఎకరాల జిరాయితీ భూమి ఆక్రమణకు గురైందని స్పందనలో వచ్చిన ఫిర్యాదుపై ఆర్డీఓ సూర్యకళ బుధవారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ వెంకటరావు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గ్రామానికి ఫిర్యాదులో పేర్కొన్న భూమిని, దానికి సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని మండలంలో జరుగుతున్న రీసర్వే లాగిన్స్‌ను పరిశీలించారు. ఇంతవరకు చేపట్టిన సర్వే ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాల తగాదాలు, కుటుంబ యాజమాన్య హక్కులు, తదితర వివాదాలకు పరిష్కారం చూపేలా సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే నిర్వహించే గ్రామాల్లో ముందస్తుగా దండోరా వేయించడంతో పాటు వలంటీర్లకు, సచివాలయాలకు, గ్రామపెద్దలకు, ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి, అందరి భాగస్వామ్యంతో సర్వే విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.



ముకుందపురంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

క్రమశిక్షణతోనే ఉజ్వల భవిష్యత్

- డీఎస్పీ ఎ.చక్రవర్తి

చీపురుపల్లి: ప్రణాళిక, క్రమశిక్షణతో విద్యనభ్యసించిన వారు మాత్రమే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని డీఎస్పీ ఎ.చక్రవర్తి అన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గాయత్రీ జూనియర్ కళాశాలలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరయ్యారు. విద్యార్థులు మద్యం, సిగరెట్, గుట్కా, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు బానిసై జీవితాలు పాడుచేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల నిర్మూలనకు కఠిన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలతో పోలీసులకు పట్టుబడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐ జి.సంజీవరావు, ఎస్సై ఎ.సన్యాసినాయుడు, కళాశాల కరెస్పాండెంట్ డి.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ చక్రవర్తి

మత్తుకు బానిసవ్వొద్దు

వేపాడ: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండాలని, ఆంధ్రప్రదేశ్‌ను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వల్లంపూడి ఎస్సై రాజేష్ పిలుపునిచ్చారు. ఎస్సై నేతృత్వంలో ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపాల్ అప్పారావు, అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాల ప్రాంగణంలో డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

గంట్యాడ: మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం అవుతాయని ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జనార్దనరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాడ్డి కుటుంబానికి పరామర్శ

గజపతినగరం: మాజీ ఎమ్మెల్యే తాడ్డి సన్యాసినాయుడు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాత్రాజు రాజారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజ్జిపురపు శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యాక్షుడు తుమ్మగంటి రామ్మోహన్, జిల్లా యువజన అధ్యక్షుడు జి.మోహన్‌కుమార్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి వి.రామకృష్ణ, తదితరులు బుధవారం పరామర్శించారు. సన్యాసినాయుడు మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఒక గొప్ప వ్యక్తికి కోల్పోవడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. సాలూరు మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బేబినాయన, కరణం శివరామకృష్ణ తదితరులు సన్యాసినాయుడు కుటుంబ సభ్యులను పరార్శించారు.

సంక్షిప్తంగా...

వైఎస్సార్ పశుబీమాతో ప్రయోజనం

చీపురుపల్లి రూరల్(గరివిడి): పాడిరైతులు వైఎస్సార్ పశుబీమా పథకం ప్రయోజనాలు పొందాలంటే తమవద్ద ఉన్న పశువులకు తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించాలని వెటర్నరీ జేడీ ఎ.విశ్వేశ్వరరావు, డీడీ వైవీ రమణ సూచించారు. గరివిడి మండలం నీలాద్రిపురం గ్రామంలో వైఎస్సార్ పశు బీమా పథకంపై బుధవారం అవగాహన కల్పించారు. ప్రకృతి విపత్తుల కారణంగా పశువులు మృతి చెందితే బీమా పరిహారం అందుతుందన్నారు.

రేపు అంతర్ముఖ యోగాలో శిక్షణ

చీపురుపల్లి రూరల్(గరివిడి): ఈ నెల 23న గరివిడిలోని గర్భాం రోడ్డులో బ్రహ్మ విద్య కుటీరంలో సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత అంతర్ముఖ యోగా శిక్షణ ఉంటుందని జెడ్పీటీసీ వాకాడ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సత్యసేవక్ భిక్షమయ్య గురూజీ పర్యవేక్షణలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అమృత ఆహార్ ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 9603093233 సంప్రదించాలని కోరారు.

200 మందికి కంటి పరీక్షలు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు సచివాలయం ఆవరణలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన శంకర్ ఫౌండేషన్ సహకారంతో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన సుమారు 200 మంది శిబిరానికి వచ్చి నేత్రపరీక్షలు చేయించుకున్నారు. వారిని కంటి వైద్యురాలు దివ్య వైద్యసేవలందించారు. 40 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఉచితంగా ఆపరేషన్‌తో పాటు కళ్లద్దాలు అందజేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో గంగుబూడి సర్పంచ్ హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయుకులు పెదిరెడ్ల వెంకటేష్, కసిరెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌పై చర్యలకు విద్యాశాఖ వెనకడుగు

శృంగవరపుకోట: పట్టణంలో నారాయణ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవటంతో విద్యాశాఖాధికారులు ఎందుకు వెనకడుగు వేస్తున్నారంటూ ఎస్.ఎస్.యు.ఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాసిపాత్రుడు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం పాఠశాల వద్ద ధర్నా చేశారు. అక్కడకు వచ్చిన ఎంఈఓ సత్యన్నారాయణకు సమస్యను వివరించారు. నారాయణ కేంబ్రిడ్జ్ పాఠశాల అనుమతులు చూపించాలని, అధిక ఫీజుల వసూలును నియంత్రించాలని కోరారు. జిల్లా అధికారులతో మాట్లాడి పాఠశాల యాజమాన్యంతో చర్చించి చర్యలు చేపడతామని ఎంఈఓ చెప్పారు.

అభివృద్ధి పనులపై చర్చ

జామి: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ శ్రీదేవి ఆధ్వర్యంలో సర్పంచ్ చిప్పాడ లక్ష్మి అధ్యక్షతన పంచాయతీ పాలకవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రంవీధిలో ఉన్న కాలవను, బీసీ కాలనిలో ఉన్న కాలువకు అనుసంధానం చేసేందుకు ఆర్అండ్‌బీ అధికారుల అనుమతికి తీర్మానం చేశారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. సమావేశంలో ఉపసర్పంచ్ అల్లు పద్మ, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లక్కవరపుకోట: ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు విధి నిర్వహణలో చేసిన సేవలే వారికి గుర్తింపునిస్తాయని కొట్యాడ సర్పంచ్ కొట్యాడ దేవి అన్నారు. మండలంలోని కొట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సత్యనారాయణ, కె.ఈశ్వరరావు, ఎ.వెంకటరావులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చిన్నారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, పాఠశాల సిబ్బంది బుధవారం సన్మానించారు.

వారపు సంతలో వసతులు మెరుగుపరచాలి

దత్తిరాజేరు: పెదమానాపురం వారపు సంతలో సౌకర్యాలు మరింత మెరుగు పరచాలని పశుసంవర్ధక శాఖ జిల్లా బోర్డ్ మెంబర్ రవీంద్రరెడ్డి అన్నారు. గ్రామ సచివాలయంలో కార్యదర్శి వాసంతి అధ్యక్షతన వారపు సంత యజమానుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో జడ్పీటీసీ రౌతు రాజేశ్వరితో కలిసి ఆయన పాల్గొన్నారు. సంతలో కల్పించాల్సిన సౌకర్యాలపై వ్యాపారులకు పలు సూచనలు చేశారు. వారపు సంత నుంచి ఇతర ప్రాంతాలకు పశువులను తరలిస్తున్న వాహనాలకు అన్ని అనుమతులు తీసుకోవాలని సాలూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రవిశంకర్ సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

దత్తిరాజేరు: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఈఓపీఆర్డీ వాణిశ్రీ అన్నారు. విధి నిర్వహణలో ఇంగిలాపల్లి కార్యదర్శి నిర్లక్ష్యంపై బుధవారం సాక్షి పత్రికలో వచ్చిన వార్తపై ఆమె విచారణ చేపట్టారు. సర్పంచ్‌కు ప్రభుత్వ కార్యక్రమాలపై సమచారం అందించక పోవడం, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యంపై ఇన్‌చార్జ్ కార్యదర్శి వెంకటరావును నిలదీశారు. మరోకసారి ఇలాంటి తప్పిదాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.